క్లుప్తంగా

శ్రీనివాసుడికి కంఠాభరణాల సమర్పణ

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులోని మిట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి సమేత గజలక్ష్మి అమ్మవారికి ఆదివారం భక్తులు కంఠాభరణాలను సమర్పించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురానికి చెందిన అజ్మీర శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు రూ.15 వేల విలువ చేసే కంఠాభరణాలను ఆలయ అర్చకులు శ్యాంసుందర శ్రీనివాసాచార్యులకు అందజేశారు. ఆలయ చైర్మన్ వెంకట్రావు దాతలను శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు, విజయకుమార్ పాల్గొన్నారు.

28 నుంచి వేసవి శిక్షణా తరగతులు

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు ఈ నెల 28 నుంచి తిరువూరులో నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన జేవీవీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. జేవీవీ జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, గౌరవాధ్యక్షుడు శీనయ్య, సభ్యులు పాపారావు, బి. వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా షిర్డీ సాయి బాబా కమిటీ ఆధ్వర్యంలో కళాకారులను ఆదివారం సన్మానించారు. కళాకారులు శీలం మధుసూదనరెడ్డి, ఆదూరి ఆంజనేయులు, శీలం ప్రసాదరెడ్డి, మరో ఐదుగురిని కమిటీ అధ్యక్షుడు నారాయణరావు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కళారంగంలో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారులు రంగస్థల నాటక పద్యాలను ఆలపించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వీ పాల్గొంటారని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వైర్ల చోరీలు

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లి, చుట్టుపక్కల విద్యుత్ వైర్లు చోరీ చేసే ముఠా రెచ్చిపోతోంది. నిర్మాణంలో ఉన్న గృహాల్లో విద్యుత్ సరఫరాకు వైరింగ్ చేయించుకున్న ఇళ్లల్లోకి చొరబడి విద్యుత్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళుతున్నారు. గత పది రోజుల వ్యవధిలో అడవినెక్కలం, పిన్నమరెడ్డిపల్లి, ఆగిరిపల్లిలో రెండు గృహాల్లో వేల రూపాయల విలువైన విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఆగిరిపల్లిలో చోరీ చేసిన దృశ్యాలు సీసీ కెమేరాలలో లభ్యమయ్యాయి. ఆగిరిపల్లిలో రెండు చోట్ల చోరీ చేసింది ఒకే వ్యక్తని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాత్రిపూట గ్రామాల్లో పోలీసు అధికారులు గస్తీ పెంచాలని, దొంగలను వెంటనే పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చూసిన కనులదే భాగ్యం

- వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
- వైభవంగా రాములోరి కల్యాణోత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

తిరువూరు/మైలవరం/నూజివీడు: శ్రీ రామనవమి వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లోనూ, పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. తిరువూరు కోదండ రామాలయం, దాసాంజనేయ స్వామి ఆలయం, రాజుపేట, చీరాల సెంటర్లలోని వీరాంజనేయస్వామి దేవస్థానం, షిర్డీ సాయి మందిరం, పాత తిరువూరు రామాలయం, ఆర్య వైశ్య కల్యాణ మండపాలలో, బోస్ సెంటర్లో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో, మేడూరు వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు, ఎ.కొండూరు, గొల్లమందల, పోలిశెట్టిపాడు, గోపాలపురం, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, కోడూరు, మాధవరం, రేపూడి గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు.

వాడవాడలా సీతారామ కల్యాణోత్సవం

చాట్రాయి: శ్రీ రామ నవమి సందర్భంగా అన్ని గ్రామాల్లో ఆదివారం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రామాలయంలో సుదర్శనం మాధవ శ్రీనివాసాచార్యుల బ్రహ్మత్వంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి సమక్షంలో 21 మంది దంపతులతో సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం వనమా నవీన్, సుధాకర్‌ల సహకారంతో గోపురంపై నిర్మించిన శిల్పాలను ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం ఎదురుగా రేకుల హాలు, స్టోర్ రూమ్‌లను ప్రారంభించారు. సోమవారం స్వామి వారి మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. అనంతరం మహా అన్నదానం, రాత్రి 11 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. బూరుగుగూడెం రామాలయంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. జనార్దనవరం దళితవాడ రామాలయంలో సీతారామ కల్యాణం నిర్వహించారు.



కాకర్లలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

నూజివీడు: శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతపేటలోని సూరి రామాలయంలో, కొత్తపేటలోని సుతార్ల రామాలయంలో, సిబ్బంది పేటలోని కోదండ రామాలయంలో, మైలవరం రోడ్డులోని ముసలి రామాలయంలో ట్రిపుల్ ఐటీ సమీపంలోని రామాలయంలో, పెద్ద గాంధీ బొమ్మ సెంటరులోని సీతారామాలయంలో, కొప్పుల వెలమపేటలో, సమతానగర్‌లో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బొందిలీపేటలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఈఈ కార్యాలయ ఆవరణలో శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ టి.శ్రీనివాసబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఇబ్రహీంపట్నం: కాచవరం కోదండ రామాలయంలో ఆలయ ట్రస్టీ బోడేపూడి అప్పారావు, కాశీరత్నం దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, శిరీషా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదాలు అందజేశారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.



ఆగిరిపల్లిలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు

చెన్నకేశవ స్వామి ఆచారంతో సేవ

- కొటికలపూడి రామాలయం వద్ద దళిత సామాజిక వర్గానికి చెందిన వారు స్వామి వార్ల చిత్రపటాలకు ఘనంగా కల్యాణం జరిపించారు. దళిత పూజారులు, కుల పెద్దల సమక్షంలో కల్యాణం జరిగింది. అనంతరం స్వామివారి దీపం స్తంభం వద్ద కత్తులకు పూజలు చేసి చెన్నకేశవస్వామి ఆచారంతో సేవ చేశారు. సేవలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు కోలాటం, భజనతో ఆకట్టుకున్నారు. దీపం స్తంభాన్ని భక్తులు గ్రామోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు.
- ఇబ్రహీంపట్నం ఫెర్రీ రామాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమా పూజలు చేశారు. కొండపల్లి చెన్నకేశవ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదానం, పానకం పంపిణీ చేశారు. కిలేశపురం సీతారామస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల పరిధిలోని పలు దేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. జి.కొండూరు కోదండ రామాలయ ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కల్యాణోత్సవం అనంతరం దేవాలయ నిర్వాహకులు పానకం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

- **మైలవరం:** మైలవరంలోని కోదండ రామాలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగం, అన్నప్రసాద వితరణ జరిగింది. రామకృష్ణ కాలనీలోని శ్రీ రామ భక్తాంజనేయస్వామి దేవస్థానంతో సీతారాముల కల్యాణాన్ని కనుల పండవగా నిర్వహించారు. భక్తాంజనేయ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్నవితరణ జరిగింది.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. కాకర్ల, చిక్కుళ్లగూడెం, చౌటపల్లి, గానుగపాడు, రోలుపడి, చింతలపాడు, ముష్టికుంట్ల, మునుకుళ్ల, అక్కపాలెం, కోకిలంపాడు, లక్ష్మీపురం, మల్లేల, ఎర్రమాడు, పెద్దవరం, వావిలాల, రాజుగూడెం, కొమ్మిరెడ్డిపల్లి, ఎరుకోపాడు, జీకొత్తూరు, ఆంజనేయపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు భక్తబృందాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం జరిగింది.



తిరువూరు కోదండ రామాలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తిరువూరు రామాలయంలో కల్యాణ మూర్తులు

పైడూరుపాడులో

పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడులోని సీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయిపావని, అభిలాష్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. మహిళల కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాయనపాడు గ్రామం శాంతినగర్‌లో, కొత్తూరు గ్రామం కోదండ రామాలయంలో, తాడేపల్లి గ్రామంలో గౌడ సంఘం కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం, అన్నదానం జరిగాయి.

- **విస్సన్నపేట:** విస్సన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో, పోలీసుస్టేషను వద్ద, బస్టాండు సెంటర్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. మండలంలోని పుట్రేల, తెల్లదేవరపల్లి, కొండపర్వ, కలగర, రామచంద్రాపురం, నరసాపురం, చంద్రుపట్ల, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లోని దేవాలయాల్లో నవమి వేడుకలు నిర్వహించారు.

ముసునూరులో

ముసునూరు: మండలంలోని శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోపూడి, బాసవరప్పాడు ముసునూరులోని వెంకటాచల స్వామి దేవస్థానం, తూర్పు, పడమర రామాలయాలు, వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, గుడిపాడు, తదితర గ్రామాల్లోని కోదండ రామాలయాల వద్ద కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు కిరణ్ కుమార్ స్వామి లోపూడిలో కల్యాణం నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లికి చెందిన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో, విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయంలో, చిన్నాగిరిపల్లి, చొప్పరమెట్ల, నూగొండపల్లి, రామాలయంలో కల్యాణం, అన్నదానం నిర్వహించారు. ఆగిరిపల్లిలో కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం చావా చిత్రాన్ని ప్రదర్శించారు.



కొటికలపూడిలో స్వామివారి దీపం స్తంభం వద్ద కత్తులకు పూజలు



చనుబండ కోదండ రామాలయంలో కల్యాణం జరుపుతున్న పండితులు



తిరువూరు దాసాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం



కొటికలపూడిలో సీతారామస్వామి చిత్రపటాలకు కల్యాణం



మైలవరం రామాలయంలో కల్యాణ వేడుకలు



నూజివీడు పట్టణంలో కల్యాణ వేడుకలు









విస్సన్నపేట పోలీస్‌స్టేషన్ వద్ద రామాలయంలో కల్యాణం : ఆంజనేయపురంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు : కాచవరంలో సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత దంపతులు ; జి.కొండూరులో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తలపడుతున్న ఎన్టీఆర్, ప్రకాశం జిల్లా జట్లు

హోరాహోరీగా సెమీ ఫైనల్

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కొటికలపూడి గ్రామంలో అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఎన్టీఆర్, ప్రకాశం జిల్లా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలను అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (అడ్మినిస్ట్రేషన్) జి.శ్రీకాంత్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన మూడు సెట్ల మ్యాచ్‌లో ప్రకాశం జట్టు రెండు సెట్లలో గెలిచి విజయం సాధించింది. ఒక సెట్టు గెలిచిన ఎన్టీఆర్ జట్టు ఓటమి పాలైంది. వాలీబాల్ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు, స్థానికులు హాజరయ్యారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు బండి వెంకటరావు, నంబూరి నాని, గ్రామ పెద్దలు రెంటపల్లి వెంకటేశ్వరరావు, మల్లి యూత్ సభ్యులు పర్యవేక్షించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్

దారికి రాని సమస్యలు

- జి.కొండూరు జగనన్న కాలనీలో సమస్యల తిష్ట
- పక్కా రహదారి లేక పాఠశాల బస్సులు రాని వైనం
- తాగునీరు, డ్రైయినేజీలు లేక కాలనీ వాసుల అవస్థలు





జి.కొండూరు జగనన్న కాలనీ : జగనన్న కాలనీలో రహదారి సమస్యను గత ఆగస్టులో అప్పటి కలెక్టర్ జి.సృజనకు వివరిస్తున్న స్థానికులు (ఫైల్)

జి.కొండూరు: దశాబ్దాలుగా చెట్టుకొకరు, పుట్టకొకరు జీవించారు. గత ప్రభుత్వ చొరవతో ఒకే చోట చేరారు. ప్రభుత్వం నుంచి ఇళ్లపట్టాలు పొంది ఇళ్లయితే నిర్మించుకున్నారు. గృహ ప్రవేశాల సమయానికి ప్రభుత్వం మారింది. కాలనీ అభివృద్ధి కుంటుపడింది. పక్కా రహదారులు, డ్రెయిజీలు, తాగునీటి సమస్యతో గత ఏడాదిగా సతమతమవుతున్నారు జి.కొండూరు జగనన్న కాలనీ వాసులు. అధికారులు స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలతో సతమతం

గత ప్రభుత్వ హయాంలో జి.కొండూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారికి మూడు వందల మీటర్ల దూరంలో 374 ప్లాట్లను వెంచరుగా వేసి పేదలకు పంపిణీ చేశారు. ఇప్పటికే 200లకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ఇళ్ల నిర్మాణం పూర్తయి 150 కుటుంబాల వరకు ఈ కాలనీలో గత కొన్ని నెలలుగా నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం మారడంతో సమస్య మొదలైంది. కనీస మౌలిక వసతులు లేక కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు. కాలనీలో తాగునీరు లేక అందుబాటులో ఉన్న బోర్లలో నీరు తాగేందుకు వీలులేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ నుంచి వచ్చే ట్యాంకర్ నీటినే తాగుతున్నారు. డ్రెయినేజీ సమస్య వేధిస్తోంది. జాతీయ రహదారి నుంచి కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల బస్సులు రహదారి సమస్యను సాకుగా చూపుతూ కాలనీలోకి రాకపోవడంతో జాతీయ రహదారి వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు సైతం బురదమయమై ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.



డ్రెయినేజీలు లేక ఇబ్బంది

కాలనీలో డ్రెయినేజీలు లేక నరకయాతన పడుతున్నాం. ఇళ్లల్లో వాడుకున్న మురుగునీరు పోయే మార్గం లేక దుర్వాసన వస్తోంది. ఇళ్ల పక్కన నిల్వ ఉండి దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. వర్షాలు పడితే మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది.
– టి.రజని, జి.కొండూరు జగనన్న కాలనీ



వర్షాకాలం నరకయాతన

హైవే నుంచి కాలనీలోకి ఉన్న ప్రధాన రహదారి బాగోలేదని స్కూల్ బస్సులు కాలనీలోకి రావడం లేదు. నాకు ఇద్దరు మనవళ్లు ఉన్నారు. మా ఇంట్లో మగవాళ్లు లేనప్పుడే మేమే నడుచుకుంటూ వెళ్లి బస్సు ఎక్కించి వస్తాం. వర్షాకాలం నరకయాతన పడుతున్నాం.
– పి.శివపార్వతి, జి.కొండూరు జగనన్న కాలనీ



ట్యాంకర్ నీరే దిక్కు

కాలనీలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం. బోర్లలో నీరు తాగేందుకు పనికి రావడంలేదు. గ్రామ పంచాయతీ వారు తీసుకొచ్చే ట్యాంకరు నీళ్లనే తాగుతున్నాం. కృష్ణా వాటర్ పైపులైన్‌ను కాలనీ వరకు తీసుకొస్తే ఇబ్బందులు పోతాయి.
– డి రుక్మిణి, జి.కొండూరు జగనన్న కాలనీ



సమస్యలను పరిష్కరించండి

కాలనీలో సమస్యలతో నరకయాతన పడుతున్నాం. గ్రామానికి కిలో మీటరు దూరంగా ఉంటున్నాం. ఏ వస్తువు కావాలన్నా గ్రామంలోకి వెళ్లాలి. రోడ్లు బాగోలేకపోతే ఎలా వెళ్లగలం. సిమెంట్ రోడ్లు వేస్తే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పుతాయి. డ్రెయినేజీలు నిర్మించాలి.
– వి.జ్యోతి, జి.కొండూరు జగనన్న కాలనీ

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మైలవరం: మైలవరం మండలంలోని బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, కాపు కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8న మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ అనూరాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు మైలవరం, పొందుగల, వెల్వడం, చంద్రగూడెం, పుల్లూరు గ్రామాలు, మధ్యాహ్నం 2 గంటలకు తోలుకోడు, మొర్సుమల్లి, కీర్తిరాయునిగూడెం, వెదురుబీడెం, కనిమెర్ల తండా, చంద్రాల, గణపవరం గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ అప్లికేషన్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు–2 సెట్లు తీసుకురావాలని సూచించారు.